క్లుప్తంగా

28న ప్రభాకర్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం



ఏటూరునాగారం: ఐటీడీఏ కార్యాలయంలో పెసా కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న కొమురం ప్రభాకర్ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా చైర్మన్ డాక్టర్ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న హైదరాబాద్‌లోని ముషీరాబాద్ సిటీ కల్చరల్ ఆడిటోరియంలో ఏషియన్ కల్చరల్ అండ్ రీసెర్చ్ ఇంటర్నేషనల్ స్ఫూర్తి అకాడమీ న్యూఢిల్లీ, ఏషియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా, స్ఫూర్తి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ అకాడమీ ఆకుల మహేందర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొమురం ప్రభాకర్‌ను సత్కరించి గౌరవ డాక్టరేట్ అవార్డును ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. భారత రాజ్యాంగం ఏజెన్సీ ప్రాంతాలలో నివసిస్తున్న ఆదివాసీలకు కల్పించిన 5వ షెడ్యూల్ లోని హక్కులు, చట్టాల అమలుకు ఆయన కృషి చేస్తున్నందున డాక్టరేట్ ఇస్తున్నట్లు వెల్లడించారు.

దహన సంస్కారాలకు విరాళాల సేకరణ



ములుగు రూరల్: జిల్లాకేంద్రానికి చెందిన నిరుపేద మామిడి రాజు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో దహన సంస్కారాలకు సీపీఎం పట్టణ కార్యదర్శి సద్దాహుంస్సేన్ ఆధ్వర్యంలో మంగళవారం విరాళాలు సేకరించారు. వ్యాపారుల వద్ద రూ. 15200 విరాళాలను సేకరించి మృతుడి కుటుంబానికి అందించారు. చింత రాజు, భరత్, రోహిత్, కన్నయ్య, ప్రవీణ్, అజయ్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



ములుగు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని జంగాలపల్లి మంగళవారం చోటు చేసుకుంది. తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంచర్ల గ్రామానికి చెందిన కడాసుల రవి ద్విచక్ర వాహనంపై ములుగు వస్తున్నారు. ఈ క్రమంలో హనుమకొండ వైపు నెంచి ఏటూరునాగారం వెళ్తున్న కారు రోడ్డు క్రాస్ చేస్తుండగా ఢీ కొట్టింది. దీంతో కడాసుల రవికి గాయాలు కావడంతో గమనించిన గ్రామస్తులు 108 సాయంతో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి విద్యార్థి ఆత్మహత్య

మంగపేట: కాలేజీకి వెళ్లకుండా జులాయిగా తిరుగుతుండగా తండ్రి మందలించడంతో మనస్థాపంతో గుండారపు రఘు(21) విద్యార్థి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చెరుపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై టీవీఆర్ సూరీ తెలిపిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చెరుపల్లి గ్రామానికి చెందిన మృతుడు రఘు ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రెండు మూడు నెలల నుంచి 15 రోజులకు ఒక సారి లేదా తనకు ఇష్టం వచ్చినప్పుడు కళాశాలకు వెళ్తు జులాయిగా తిరుగుతుండటంతో తండ్రి ఈశ్వరయ్య కుమారుడిని మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైై రఘు సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితికి చేరుకున్న రఘును కుటుంబ సభ్యులు హుటాహుటిన ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. మంగళవారం మృతుడి తండ్రి ఈశ్వరయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



ఆయుష్మాన్ మందిర్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ గోపాల్‌రావు



ఐటీడీఏలో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

● డీఎంహెచ్ఓ గోపాల్‌రావు

ఏటూరునాగారం: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గోపాల్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఆకుల వారి ఘణపురం-3 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ముందుగా అయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని సందర్శించి కేంద్రానికి వచ్చిన రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రానికి వచ్చే రోగులకు, గ్రామాల్లోని ప్రజలకు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. అప్పుడే ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రజలు వస్తారని సిబ్బందికి తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ మలేరియా, డెంగీ, ఆర్‌డీటీ పరీక్షలు చేయాలని ఆదేశించారు. ప్రతీ పాఠశాల, ఆశ్రమ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, ఆహారపు అలవాట్లు శారీరక శ్రమపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదే విధంగా ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వైద్యాధికారులకు ఆయుష్మాన్ ఆరోగ్యం డాక్టర్లకు, మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలకు జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు, జాతీయ అసంక్రమిత నియంత్రణ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ పవన్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మధుమేహం, హైపర్ టెన్షన్ వ్యాధుల నిర్ధారణ పరీక్షలను 30ఏళ్లకు పైబడిన అందరికీ వచ్చే సంవత్సరం ఫిబ్రవరి మాసంలో మూడో విడత పరీక్షలు వందశాతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుమలత, డాక్టర్ మమత, ఇన్‌చార్జ్ డెమో సంపత్, అసంక్రమిత వ్యాధుల జిల్లా కోఆర్డినేటర్ వెంకటరెడ్డి, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, సూపర్‌వైజర్ గంగా, ఖలీల్ ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు



ప్రగళ్లపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

● ఎఫ్ఎస్ఓ దేవయ్య

వాజేడు: అడవికి నిప్పు పెడితే మానవ మనుగడకు ముప్పని ఎఫ్ఎస్ఓ దేవయ్య అన్నారు. మండల పరిధిలోని ప్రగళ్లపల్లి, మొరుమూరు, కొంగాల గ్రామాల్లో అటవీశాఖ సిబ్బంది అడవిని సంరక్షించాలని కోరుతూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మూడు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్ఓ దేవయ్య మాట్లాడుతూ అడవులను రక్షించుకోవడం అందరి బాధ్యత అన్నారు. అడవిలో నిప్పు పెడితే మంటలు చెలరేగి అడవికి నష్టం వాటిల్లుతుందన్నారు. దాని మూలంగా మనకు అందే స్వచ్ఛమైన ఆక్సిజన్ అందకపోగా సకాలంలో వర్షాలు పడక ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఎవరైనా అడవిలో నిప్పు పెడితే అటవీ శాఖ సిబ్బందికి వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. బీట్ ఆఫీసర్లు గొంది నారాయణ, లలిత, సంతోష్ కుమార్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.



కొంగాలలో..

భిక్షాటన చేసి ఉద్యోగుల నిరసన



భిక్షాటన చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు



మాట్లాడుతున్న దిలీప్

ములుగు: సమగ్రశిక్ష ఉద్యోగులు సమ్మె కార్యక్రమంలో భాగంగా 15వ రోజు జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి, ఆయా కాలనీల్లోని దుకాణాలు, కార్యాలయాల్లో భిక్షాటన చేసి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి కుమార్ పాడ్య, ఉపాధ్యక్షుడు ఎండీ ఫిరోజ్, కార్యవర్గ సభ్యులు సుజాత, రమేశ్ పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి

సమగ్రశిక్ష ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ సీనియర్ నాయకుడు దిలీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీక్ష శిబిరం వద్ద ఆయన మాట్లాడుతూ.. సమగ్రశిక్ష ఉద్యోగుల విషయంలో శాసనసభలో లేవనెత్తకపోవడం బాధాకరం అని అన్నారు. సమ్మె కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యాశాఖ కార్యాలయాల్లో రోజువారి కార్యక్రమాలు నత్తనడకన సాగుతున్నాయని అన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 26న హైదరాబాద్‌లో చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీనియర్ నాయకుడు హట్కర్ సమ్మయ్య పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏఓకు మెమోరాండం అందించారు. రఘురాం, రామల్, జయరాం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎస్ఎస్ తాడ్వాయి: చెక్కు పంపిణీ చేస్తున్న రవిచందర్



గోవిందరావుపేట: చెక్కులు అందజేస్తున్న అధికారులు, నాయకులు

● గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రవిచందర్

ఎస్ఎస్‌తాడ్వాయి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరూ సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను అధికారులు పెండింగ్‌లో పెట్టవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడారం జాతర చైర్మన్ లచ్చుపటేల్, మాజీ సర్పంచులు ఇర్ప సునీల్‌దొర, మంకిడి నరసింహస్వామి, బెజ్జూరి శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్ పాల్గొన్నారు.

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని రైతు వేదికలో తహసీల్దార్ సృజన్ కుమార్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ హాజరై లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, సహకార సంఘం అధ్యక్షుడు పన్నాల ఎల్లారెడ్డి, జిల్లా కార్మిక శాఖ అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

● ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ సతీష్



మాట్లాడుతున్న సతీశ్

వెంకటాపురం(కె): షెడ్యూల్ ప్రాంతాల భూ బదలాయింపు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో మండల ఉపాధ్యక్షుడు తాటి రాంబాబు అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సతీష్ మాట్లాడుతూ.. ఆదివాసీల సంక్షేమం కోసం బ్రిటీష్, నిజాం ప్రభుత్వాలు చేసిన ప్రత్యేక చట్టాల కొనసాగింపులో భాగంగా రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారం అనేక చట్టాలను రూపొందించినట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో పెసా, 1/70 చట్టాలను అమలు చేయడంలో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి అధికారులు ఉన్నప్పటికి ఆదివాసీలకు న్యాయం జరుగడంలో జాప్యం జరుగుతుందన్నారు. రమేశ్, బొగ్గుల గోపి, వెంకటేశ్వర్లు, దివ్యకుమారి ఉన్నారు.

డీసీఆర్బీ డీఎస్పీగా కిశోర్



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ

ములుగు: జిల్లా క్రైం రికార్డ్స్ బ్యూరో(డీసీఆర్బీ) డీఎస్పీగా కిశోర్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ శబరీశ్‌కు పూలమొక్కను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

● సీపీఎం మండల కార్యదర్శి మల్లారెడ్డి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

గోవిందరావుపేట: హోం మంత్రి అమిత్ షా ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఎం మండల కార్యదర్శి సోమా మల్లారెడ్డి అన్నారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ మండల పరిధిలోని పస్రా చౌరస్తాలో అంబేడ్కర్ చిత్రపటంతో సీపీఎం ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకోని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. హోం మంత్రికి రాజ్యాంగాన్ని గౌరవించడం తెలియకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యవర్గ సభ్యుడు చిట్టిబాబు, జిలా కమిటీ సభ్యులు తీగల ఆదిరెడ్డి, గ్రామ కార్యదర్శి కడారి నాగరాజు, నాయకులు ఉపేంద్ర చారి, అంబాల మురళి, అంజద్, జిట్టబోయిన రమేశ్, చిన్నపల్లి అశోక్, పురుషోత్తం రెడ్డి, చంద్రారెడ్డి, కవిత, సువర్ణ, రాజేశ్వరీ, స్వరూప, శ్రీనివాస్, సూర్యనారయణ, రాజు, అరుణ్, జీవన్, మహేష్, మొగిళి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి

● ఎన్‌హెచ్ఆర్‌సీ మండల అధ్యక్షుడు కిరణ్

టేకుమట్ల: గ్రీన్ ఫీల్డ్ హైవేలో భూములను కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందించాలని ఎన్‌హెచ్ఆర్‌సీ మండల అధ్యక్షుడు శాస్త్రాల కిరణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంచిర్యాల నుంచి వరంగల్ వరకు నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ హైవే 163 కారిడార్ కోసం 2019 నుంచి రైతుల భూములను తీసుకునేందుకు చేస్తూ ముందుకు సాగుతుందని అన్నారు. ఎకరాకు రూ.30లక్షలను చెల్లించేందుకు కలెక్టర్ హామీ ఇవ్వడంతో రైతుల అంగీకరించారని అన్నారు. టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల్లో సుమారు 26 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ఇప్పటి వరకు పరిహారం చెల్లించలేదన్నారు. పరిహారం చెల్లించి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని, లేని పక్షంలో నిర్మాణాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. మండల ప్రధాన కార్యదర్శి వీరేశం ఉన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

కాటారం: మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు క్రిస్మస్ తాతయ్య, క్రైస్తవ మతస్థుల వేషాధారణలో అలరించారు. కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వలుస వెంకటేశ్వర్లు, డీఐఓ వెంకన్న మాట్లాడుతూ.. నేటి సమాజంలో శాంతి, ప్రేమ, సహృదయంతో కూడిన భావనలు విరజిల్లాలంటే యేసు మార్గం తప్పనిసరిగా అనుసరించాలని తెలిపారు. క్రిస్మస్ తాతయ్య వేషాధారణతో సైఫ్‌ఖాన్, శాంతాక్లజ్‌గా వర్షిణి వ్యవహరించగా బహుమతులు అందజేశారు.

'ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు'



మాట్లాడుతున్న రాజమ్మ

కాటారం: రాష్ట్రంతో పాటు మంథని నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబుపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని మల్హర్ మాజీ జెడ్పీటీసీ కొండ రాజమ్మ, కాంగ్రెస్ మండల మహిళ అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మహదేవపూర్‌లో బీఆర్ఎస్ నాయకురాలు గీతాబాయి మంత్రిపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఊసరవెల్లిలా పార్టీలు మారుస్తున్న గీతాబాయి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతుందని విమర్శించారు. మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీనుబాబును విమర్శించే స్థాయి ఆమెది కాదన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ అంశంలో మంత్రికి, ఆయన సోదరుడికి ఎలాంటి సంబంధం లేదన్నారు. శకుంతల, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో నాణ్యమైన విద్య

● ప్రిన్సిపాల్ తాళ్లపెల్లి రాకేశ్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

టేకుమట్ల: కార్పొరేట్‌కు దీటుగా మోడల్ స్కూల్‌లో నాణ్యమైన విద్య లభిస్తుందని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కొర్కిశాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తాళ్లపెల్లి రాకేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని అంకుసాపూర్, సోమనపల్లి, సుబ్బక్కపల్లి, ఆసిరెడ్డిపల్లి గ్రామాల్లో కొర్కిశాల మోడల్ ఉపాధ్యాయ బృందం మోడల్ స్కూల్ ప్రవేశాల కర పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మోడల్ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమంలో విద్యాభ్యాసం కొనసాగుతుందని, కావున పట్టణాలకు పిల్లల్ని పంపించకుండా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొగుళ్లపల్లి మండలంలోని కొర్కిశాల మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో 100 సీట్లు, 7, 8, 9, 10 తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం ప్రవేశాలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దూర ప్రాంత విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపు కొమురెల్లి, యార దేవేందర్, అందె కుమార్, అజయ్, మార్క కిరణ్, పోతుగంటి మహేష్, గౌడ రాజ్‌కుమార్ ఉన్నారు.

పరామర్శ

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మణ్‌రావు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంగళవారం పరామర్శించారు. లక్ష్మణ్‌రావు మృతదేహానికి పార్టీ కండువా కప్పి, పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, రాజేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన కారుపాక కొమురమ్మ కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు కేదారి గీత, శ్రీపతి బాపు, అలీంఖాన్, జవ్వాజీ తిరుపతి, మహేష్, సల్మాన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

'ఉద్యోగ భద్రత సాధించే వరకు పోరాటం'

● ఆదివాసీ సంఘాల నాయకులు



ఏటూరునాగారం: సమ్మె నిర్వహిస్తున్న సీఆర్‌టీలు

ఏటూరునాగారం: సీఆర్‌టీలకు ఉద్యోగ భద్రత కల్పించే వరకు పోరాటం చేద్దామని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర పోల్‌సింగ్, ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బచ్చల ఎర్రయ్య, ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సప్క నాగరాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యాప సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ ఎదుట సీఆర్‌టీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మెకు లంబాడీ, ఆదివాసీ హక్కుల పోరాట సమితి, ఆదివాసీ ఫెడరేషన్ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించి మాట్లాడారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై ఉద్యోగం చేస్తున్న సీఆర్‌టీలను రెగ్యులరైజ్ చేయాలన్నారు. వారి డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్, రామయ్య, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సమ్మెకు మద్దతు

వెంకటాపురం(కె): ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు ఏటూరునాగారం ఐటీడీఏ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెకు తెలంగాణ ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు మంగళవారం సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏటీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సప్క నాగరాజు మట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలన్నారు. ఆయన వెంట సీఆర్‌టీల రాష్ట్ర అధ్యక్షుడు సోమేశ్వర్, ఉపాధ్యక్షుడు రవీందర్, జిల్లా అధ్యక్షుడు కొండ రామయ్య తదితరులు ఉన్నారు.

వృథాగా సాగునీరు



గోవిందరావుపేట: మండలంలోని లక్నవరం సరస్సులోని సాగునీరు వృథాగా పోతుంది. రెండు రోజుల క్రితం నర్సింహుల కాల్వ నీటిని విడుదల చేశారు. కాలవ్లో అక్కడక్కడ పంట పొలాల్లోకి నీటిని విడుదల చేయడానికి తూముల వద్ద షట్టర్లు ఉండగా తుప్పు పట్టయడంతో తీసివేశారు. కానీ మళ్లీ వాటి కొత్త షట్టర్లు బిగించలేదు. దీంతో నీరు వృథాగా పోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి షట్టర్లు బిగించాలని రైతులు కోరుతున్నారు. ఇలాగే నీరు వృథా పోతే యాసంగి పంటకు నీరు సరిపోక పంటలు ఎండిపోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.